నిజ్జర్ హత్య కేసులో సాక్ష్యాలేవీ?

భారత హైకమిషనర్ సంజయ్

ఒట్టావా : సిక్కు తీవ్రవాది నిజ్జర్ హత్య కేసులో కెనడా ఉన్నత స్థాయి అధికారుల ప్రకటనలతో దర్యాప్తు తప్పుదోవపట్టిందని కెనడాలో భారత హైకమిషనర్ సంజయ్‌కుమార్ వర్మ ఆరోపించారు. ఆరోపణలకు కెనడా సాక్ష్యాలు చూపాలని ఆయన డిమాండ్ చేశారు. గ్లోబల్ అండ్ మెయిల్ వార్తాపత్రికకు శుక్రవారం ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ దర్యాప్తులో వారికి సహకరించడానికి నిర్దిష్టమైన సమాచారం భారత్‌కు అందించలేదని తెలిపారు. 'సాక్ష్యం ఎక్కుడుంది?దర్యాప్తు ఇప్పటికే కళంకితమైందని నేను చెప్పగలను' అని వర్మ అన్నారు. 'హత్య వెనుక ఇండియన్ ఏజెంట్లు ఉన్నారని చెప్పమని ఉన్నతస్థాయిలో ఒకరి నుంచి ఆదేశాలు వచ్చాయి' అని ఎవరి పేరూ ప్రస్తావించకుండా శనివారం ఆయన వెల్లడించారు.

కర్ణాటకలో ప్రభుత్వ అధికారిణి దారుణ హత్య

బెంగళూరు : కర్ణాటకలో మహిళా ప్రభుత్వ ఉన్నతాధికారి దారుణ హత్యకు గురయ్యారు. గనులు, భూగర్భ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న ప్రతిమ(45)ను బెంగళూరు సుబ్రహ్మణ్యపురలోని ఆమె నివాసంలో గుర్తు తెలియని వ్యక్తులు కొట్టి చంపారని పోలీసులు తెలిపారు. శనివారం రాత్రి ఈ ఘటన జరిగిందని, ఆ సమయంలో ఇంటి వద్ద ఆమె ఒక్కరే ఉన్నారని తెలిసింది. ప్రతిమ సోదరుడు ఆదివారం తెల్లవారుజామున ఇంటికి వచ్చి చూడగా.. ఆమె విగతజీవిగా పడి ఉండటం చూసి షాక్‌కు గురయ్యాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించాడు. హత్యకు గల కారణం తెలియరాలేదని, విచారణ నిమిత్తం మూడు బృందాల్ని ఏర్పాటుచేశామని బెంగళూరు సిటీ సౌత్ డివిజన్ డీసీపీ రాహుల్‌కుమార్ చెప్పారు.

క్రిమినల్ కేసులు మోపేందుకు బీజేపీ కుట్ర: మహువా

న్యూఢిల్లీ: పశ్చిమ బెంగాల్ టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా బీజేపీపై ఆదివారం మరింత తీవ్రంగా విరుచుకుపడ్డారు. లంచం తీసుకుని లోక్‌సభలో ప్రశ్నలు అడిగినట్లు తనపై వచ్చిన ఆరోపణలపై క్రిమినల్ కేసులు పెట్టే యోచనలో బీజేపీ ఉందని ఓ ట్వీట్ చేశారు. తనకు ఎన్ని జతల చెప్పులు ఉన్నాయో అడగడానికి ముందు బొగ్గు కుంభకోణంలో అదానీ మీద కేసు పెట్టాలన్నారు. పార్లమెంటు ఎథిక్స్ కమిటీ విచారణలో కమిటీ చైర్మన్ వినోద్ సోన్‌కర్ తనతో, ప్రతిపక్ష ఎంపీలతో మాట్లాడిన మాటలన్నీ రికార్డయి ఉన్నాయని చెప్పారు. తప్పుడు ఆరోపణలతో మహిళా ఎంపీలను బయటకు తోసేయడానికి ముందు ఈ విషయాన్ని గుర్తుంచుకోవాలని హెచ్చరించారు.

తేనెటీగలతో సరిహద్దు భద్రత!

న్యూఢిల్లీ, నవంబర్ 5: సరిహద్దు భద్రతకు తేనెటీగలను బీఎస్ఎఫ్ రంగంలోకి దించింది. సరిహద్దుల్లో అక్రమ రవాణా నిరోధానికి ఈ వినూత్న ప్రయోగాన్ని చేపట్టింది. బెంగాల్‌లోని భారత్-బంగ్లాదేశ్ సరిహద్దు వెంబడి కంచెపై తేనెతుట్టలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దీని ద్వారా పశువుల అక్రమ రవాణా, ఇతర నేరాల నిరోధంతో పాటు సరిహద్దు కంచె కత్తిరింపు నిరోధానికి అడ్డుకట్ట వేయాలని భావిస్తున్నది. అంతేకాకుండా దీని ద్వారా స్థానికులకు ఉపాధి కల్పించవచ్చని పేర్కొన్నది. తొలిసారిగా బీఎస్ఎఫ్ 32 బెటాలియన్ నదియా జిల్లాలో ఈ ప్రయోగాన్ని చేపట్టింది. బంగ్లాదేశ్‌తో భారత్ 4,096 కిలోమీటర్ల సరిహద్దును పంచుకుంటున్నది.

రామమందిర ప్రతిష్ఠాపన వేడుకలు ప్రారంభం

అయోధ్య: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ఠకు ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆదివారం అక్షత పూజతో ప్రాణప్రతిష్ఠ వేడుకలు ప్రారంభమైనట్టు శ్రీరామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ తెలిపింది. ఈ అక్షతలను దేశవ్యాప్తంగా పంపిణీ చేయనున్నట్టు వెల్లడించింది. అక్షతల కోసం 100 క్వింటాళ్ల బియ్యం, పసుపు, దేశవాళీ నెయ్యిని వినియోగించినట్టు పేర్కొన్నది. విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) సభ్యులు వీటిని దేశవ్యాప్తంగా పంచుతారని చెప్పింది.

తొలి విడతలో పైచేయి ఎవరిదో?

- రేపు ఛత్తీస్‌గఢ్ మొదటి విడత ఎన్నికలు
- 20 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్
- అధికార కాంగ్రెస్, బీజేపీ హోరాహోరీ
- సీఎం బఘేల్‌పై 'మహదేవ్' ముడుపుల ఆరోపణలు.. చిక్కుల్లో కాంగ్రెస్
- ఇప్పటికే ప్రభుత్వంపై తీవ్ర వ్యతిరేకత
- నాయకత్వ లోపంతో బీజేపీ సతమతం



రాయ్‌పూర్, నవంబర్ 5: ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల మొదటి విడత సంగ్రామానికి రంగం సిద్ధమైంది. ఈ నెల 7న (మంగళవారం) తొలి విడతలో 20 అసెంబ్లీ స్థానాలకు పోలింగ్ జరుగనుంది. ఆయా స్థానాల్లో ఆదివారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగిసింది. పోలింగ్‌కు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. నక్సల్ ప్రభావిత బస్తర్ డివిజన్‌లోని ఏడు జిల్లాలు, మరో నాలుగు ఇతర జిల్లాల్లో ఈ 20 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. 25 మంది మహిళలతో పాటు మొత్తం 223 మంది అభ్యర్థులు తొలి విడత బరిలో ఉన్నారు. రాష్ట్రంలో ప్రధాన పార్టీలుగా ఉన్న అధికార కాంగ్రెస్, బీజేపీ ఇప్పటికే ప్రచారంతో హోరెత్తించాయి. రాష్ట్రంలో 15 ఏండ్ల బీజేపీ పాలనకు ముగింపు పలుకుతూ 2018లో కాంగ్రెస్‌కు ప్రజలు అధికారం కట్టబెట్టారు. ఈ సారి ఎన్నికల్లో రెండు పార్టీల మధ్య హోరాహోరీ పోరు సాగే అవకాశం ఉన్నదని సర్వేలు చెప్తున్నాయి. తొలి విడతలో ఎన్నికలు జరుగుతున్న 20 స్థానాల్లో గత ఎన్నికల్లో కాంగ్రెస్ 17 సీట్లను కైవసం చేసుకుంది. కాగా, రెండో విడుతలో 70 స్థానాలకు ఈ నెల 17న పోలింగ్ జరుగనుంది.

బఘేల్‌కు 'మహదేవ్' చిక్కులు

ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్‌కు మహదేవ్ బెట్టింగ్ యాప్‌తో సంబంధాలు ఉన్నాయని, యాప్ ప్రమోటర్ల నుంచి కోట్లాది రూపాయలు ముడుపులు అందాయన్న ఈడీ ఆరోపణలు సంచలనంగా మారాయి. ఈ నేపథ్యంలో తాజా ఆరోపణలు ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశం లేకపోలేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ అంశంపై సీఎం బఘేల్‌ను లక్ష్యంగా చేసుకొని ప్రధాని మోదీ తన ఎన్నికల సభల్లో విమర్శలు గుప్పించారు. బీజేపీ నేతలు తమ ప్రచారంలో మత మార్పిడులు, రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించడం, ప్రభుత్వం అవినీతి వంటి అంశాలను టార్గెట్‌గా చేసుకొన్నారు. అయితే బీజేపీలో నాయకత్వం లోపించింది. మాజీ సీఎం రమణ్‌సింగ్ చురుగ్గా లేరు. దీంతో మోదీ చరిష్మాపైనే బీజేపీ భారం వేసింది. ప్రభుత్వం చేపట్టిన పలు సంక్షేమ కార్యక్రమాల ఆధారంగా కాంగ్రెస్ నేతలు ప్రచారం చేశారు.

హామీల అమలులో 'హస్తం' విఫలం

గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో హస్తం పార్టీ ఘోరంగా విఫలమైందనే విమర్శలు ఉన్నాయి. దీనిపై ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారు. రైతు రుణాల మాఫీ, 60 ఏండ్లు పైబడిన రైతులకు పింఛను, నిరుద్యోగులకు భృతి, రాష్ట్రవ్యాప్తంగా సంపూర్ణ మద్యపాన నిషేధం, కాంట్రాక్ట్ ఉద్యోగుల్ని రెగ్యులరైజ్ చేస్తామని 2018 ఎన్నికల సమయంలో ఊదరగొట్టిన కాంగ్రెస్.. వాటి అమలులో మాత్రం చిత్తశుద్ధి చూపలేదు. వాగ్దానాల అమలు, సంక్షేమం, అభివృద్ధి మరచిన కాంగ్రెస్ సర్కారు.. అంతర్గత కుమ్ములాటలతో మునిగిపోయింది. ఇదే సమయంలో ప్రభుత్వంపై అవినీతి ఆరోపణలు పెద్దయెత్తున వచ్చాయి. బొగ్గు రవాణాలో అవినీతి, మద్యం అమ్మకాల్లో అక్రమాలు, మినరల్ ఫౌండేషన్ నిధుల దుర్వినియోగం, పబ్లిక్ సర్వీస్ కమిషన్ నియామకాల్లో అవకతవకలు, మత ఘర్షణలు.. ఇవన్నీ కాంగ్రెస్ సర్కారుకు తలనొప్పులు తీసుకొచ్చాయి. దీంతో వచ్చే ఎన్నికల్లో హస్తం పార్టీ గెలుపు అంత సులభం కాదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



మిజోరంలో త్రిముఖ పోరు

- రేపు ఒకే విడతలో రాష్ట్రంలోని 40 అసెంబ్లీ స్థానాలకు ఎన్నికలు
- అధికార ఎంఎన్ఎఫ్, కాంగ్రెస్, జెడ్‌పీఎం పార్టీల మధ్య పోటీ

ఐజ్వాల్, నవంబర్ 5: ఈశాన్య రాష్ట్రం మిజోరంలో అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి ఆదివారం సాయంత్రంతో తెరపడింది. రాష్ట్రంలోని 40 అసెంబ్లీ నియోజకవర్గాలకు ఒకే విడతలో మంగళవారం ఎన్నికలు జరుగనున్నాయి. మొత్తం 8.57 లక్షల మందికి పైగా ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించనున్నారు. ఎన్నికల్లో 174 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. అధికారులు రాష్ట్రవ్యాప్తంగా 1,276 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. అంతఃరాష్ట్ర, అంతర్జాతీయ సరిహద్దుల్లోని దాదాపు 30 పోలింగ్ కేంద్రాలను సున్నితమైనవిగా గుర్తించినట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి హెచ్ లియాంజెలా పేర్కొన్నారు. బంగ్లాదేశ్, మయన్మార్‌తో సరిహద్దులు పంచుకొనే ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేసినట్టు పోలీసు ఉన్నతాధికారి ఒకరు వెల్లడించారు. మొత్తంగా 3 వేల మంది పోలీసు సిబ్బంది, 5,400 మంది కేంద్ర సాయుధ పోలీసు బలగాలను మోహరించామని తెలిపారు.

మూడు పార్టీల ముమ్మర ప్రచారం

మిజోరంలో త్రిముఖ పోటీ నెలకొన్నది. అధికార మిజో నేషనల్ ఫ్రంట్ (ఎంఎన్ఎఫ్), ప్రతిపక్ష కాంగ్రెస్, జోరం పీపుల్స్ మూవ్‌మెంట్(జెడ్‌పీఎం) మధ్య ప్రధానంగా పోటీ నెలకొన్నది. అధికారాన్ని నిలబెట్టుకొనేందుకు ఎంఎన్ఎఫ్ ముమ్మర ప్రచారం చేసింది. గత ఐదేండ్లలో చేపట్టిన అభివృద్ధిని చెప్పుకోవడంతోపాటు శరణార్థులు, ఇతర ప్రాంతాల నుంచి వలసల అంశాన్ని ఉపయోగించుకొనేందుకు ప్రయత్నించింది. అటు మిజోరంలో గత రెండు పర్యాయాలుగా అధికారానికి దూరంగా ఉన్న హస్తం పార్టీ.. ఈసారి ఎలాగైనా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని పట్టుదలతో ఉన్నది. ఇందులో భాగంగా ఎంఎన్ఎఫ్ ప్రభుత్వం గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందనే ప్రధాన ప్రచారాస్త్రంతో ముందుకెళ్లింది. మరోవైపు గత అసెంబ్లీ ఎన్నికల్లో 8 స్థానాల్లో విజయం సాధించి సంచలనం సృష్టించిన జెడ్‌పీఎం పార్టీ ఈసారి ఎన్నికల్లో కింగ్ మేకర్‌గా నిలిచి, ప్రభుత్వ ఏర్పాటులో కీలక పాత్ర పోషించాలనే లక్ష్యంతో ఉన్నది. మార్పు రావాలనే నినాదంతో పాటు కొత్త పాలనా వ్యవస్థను తీసుకొస్తామన్న హామీపై ఆ పార్టీ నమ్మకం పెట్టుకొన్నది.

బఘేల్ చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

- మహదేవ్ ముడుపుల కేసులో వెలుగులోకి కీలక విషయాలు
- వందలాది కోట్లు ఇచ్చినట్టు ఒప్పుకున్న యాప్ యజమాని
- ముఖ్యమంత్రే దుబాయ్ పారిపొమ్మన్నారని వెల్లడి

న్యూఢిల్లీ, నవంబర్ 5: మహదేవ్ బెట్టింగ్ యాప్ ముడుపుల కేసులో ఛత్తీస్‌గఢ్ సీఎం, కాంగ్రెస్ నేత భూపేశ్ బఘేల్ చుట్టూ ఉచ్చు బిగుస్తున్నది. యాప్ యజమానిగా భావిస్తున్న శుభమ్ సోని నేరాన్ని ఒప్పుకోవడంతో బఘేల్ చిక్కుల్లో పడ్డారు. తనకు, బఘేల్‌కు ఉన్న సంబంధాల గురించి ఆయన వెల్లడించమే కాక, బఘేల్‌కు వందలాది కోట్ల రూపాయలను ముడుపులుగా ఇచ్చానని అంగీకరిస్తూ ఓ వీడియో విడుదల చేశారు. యూఏఈ వెళ్లిపొమ్మని భూపేశ్ బఘేలే తనకు సలహా ఇచ్చారని ఆయన ఆ వీడియోలో పేర్కొన్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. మంగళవారం అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న క్రమంలో తాజా పరిణామాలు కాంగ్రెస్‌ను చిక్కుల్లో పడేశాయి. ఎన్నికల కోసం మహదేవ్ యాప్ నిర్వాహకుల నుంచి బఘేల్‌కు రూ.508 కోట్ల ముడుపులు అందినట్టు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే.

బఘేల్‌తో లింక్ నిజమే

ఈ కేసులో ప్రధాన నిందితుడైన శుభ్‌మన్ సోని దుబాయ్ నుంచి వీడియో విడుదల చేశారు. అందులో సీఎం బఘేల్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. బఘేలే తనను దుబాయ్ పారిపొమ్మని సలహా ఇచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. తానే మహదేవ్ యాప్‌కు అసలైన యజమానినని, ఈ యాప్ ద్వారా వందలాది కోట్లను ఆర్జిస్తుండటంతో, చట్టపరమైన ఇబ్బందులు ఏర్పడ్డాయని, వాటి నుంచి రక్షణకు నేతలను ఆశ్రయించామని చెప్పారు. అందులో భాగంగానే బఘేల్‌కు పెద్దమొత్తంలో ముడుపులు అందజేసినట్టు తెలిపాడు. ఇటీవల కేంద్ర దర్యాప్తు సంస్థలు తనపై నిఘా ఉంచాయన్నారు. కాగా, ఇటీవల ఆసిమ్ దాస్ అనే కొరియర్ నుంచి ఈడీ 5.39 కోట్లను స్వాధీనం చేసుకుంది. సీఎం బఘేల్ కోసం ఆ మొత్తాన్ని తనకు దుబాయ్ నుంచి శుభమ్ సోని పంపినట్టు ఆయన ఈడీ వద్ద అంగీకరించాడు. దీంతో అతని సెల్‌ఫోన్, శుభ్‌మన్ సోని నుంచి వచ్చిన ఈ-మెయిల్స్ పరిశీలించగా, ఇప్పటివరకు మహదేవ్ యాప్ ప్రమోటర్ల నుంచి బఘేల్‌కు రూ.508 కోట్లు ముడుపులుగా అందినట్టు అధికార వర్గాలు తెలిపాయి.

మహదేవ్ సహా 22 బెట్టింగ్ యాప్‌లపై నిషేధం

న్యూఢిల్లీ: మహదేవ్ సహా 22 బెట్టింగ్ యాప్‌లపై కేంద్రం నిషేధం విధించింది. ఇలాంటి బెట్టింగ్ యాప్‌లను నిషేధించే అధికారం ఉన్నప్పటికీ వాటిని నిషేధించాలంటూ ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం ఎప్పుడూ తమకు విజ్ఞప్తి చేయలేదని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఆరోపించారు. దీంతో మహదేవ్‌తో పాటు రెడ్డిఅన్నప్రెస్టాప్రో లాంటి 22 బెట్టింగ్ యాప్‌లు, వెబ్‌సైట్‌లపై తమ మంత్రిత్వ శాఖ నిషేధం విధించిందన్నారు.

బీజేపీ నేతకు కాంగ్రెస్ టికెట్!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి అభ్యర్థులు దొరక్క మల్లగుల్లాలు పడుతున్న కాంగ్రెస్.. మధ్యప్రదేశ్‌లో బీజేపీ నేతకు టికెటిచ్చింది. తీరా ఆ బీజేపీ నాయకుడు తాను టికెట్ కోసం దరఖాస్తే పెట్టుకోలేదని, తాను బీజేపీని వీడనని ప్రకటించడంతో కాంగ్రెస్ అభాసుపాలైంది. మధ్యప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన తాజా లిస్టులో అశోక్‌నగర్ అసెంబ్లీ అభ్యర్థిగా బీజేపీ నేత దీపక్ పాలీవాల్‌ను ప్రకటించింది.

కాంగ్రెస్ జిత్తులమారి పార్టీ

తికమ్‌గఢ్, నవంబర్ 5: ఎంతో ఆర్భాటంగా ప్రకటించిన విపక్ష 'ఇండియా' కూటమి మూణ్నాళ్ల ముచ్చట లాగా కనిపిస్తున్నది. ఒకసారి కూడా కలిసికట్టుగా ఎన్నికల్లో పోటీచేయకుండానే అప్పుడే కూటమికి బీటలు వారుతున్నాయి. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీలు ఎవరికి వారే పోటీచేస్తుండగా.. ఇటు కాంగ్రెస్ తీరుపై కూటమిలోని ఇతర పార్టీలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తుతున్నాయి. కాంగ్రెస్ పార్టీతో పొసగకపోవడంతో మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో సమాజ్‌వాదీ పార్టీ సొంతంగా బరిలోకి దిగింది. ఆదివారం రాష్ట్రంలోని తికమ్‌గఢ్‌లో నిర్వహించిన ఎన్నికల ర్యాలీలో ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ మాట్లాడుతూ అధికార బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీలపై మండిపడ్డారు. కాంగ్రెస్‌ను పెద్ద 'కన్నింగ్(జిత్తులమారి)' పార్టీగా అభివర్ణించారు. కమలం పార్టీకి ఓటేయొద్దని ప్రజలకు పిలుపునిచ్చారు. ఓట్ల కోసం కులగణన చేపడుతామని కాంగ్రెస్ చెబుతుందే తప్ప, ఆ పార్టీకి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. తమను మోసం చేయగలిగిన పార్టీ.. ఇక రాష్ట్ర ప్రజలను మోసం చేయడం పెద్ద పని కాదని అఖిలేశ్ అన్నారు.

ఎన్నికల్లో డబ్బు పంచుతున్న ఈడీ

రాజస్థాన్ సీఎం గెహ్లోట్ తీవ్ర ఆరోపణలు

జోధ్‌పూర్, నవంబర్ 5: ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)పై రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఈడీ డబ్బును పంపిణీ చేస్తున్నదని ఆరోపించారు. అయితే తాను చేసిన ఆరోపణకు సంబంధించిన వివరాలను ఆయన పూర్తిగా వివరించలేదు. 'దేశంలో ఎన్నికలు, ఈడీ దాడులు ఏకకాలంలో జరగడం ఇదే మొదటిసారి. ఈ ఎన్నికల్లో ఈడీ డబ్బు పంచుతున్నది. ఈ విషయంలో ఎన్నికల సంఘం వెంటనే జోక్యం చేసుకోవాలి' అని ఆయన పేర్కొన్నారు. వాస్తవానికి దేశంలో ఆర్థిక నేరాలు, ఎగవేతలకు పాల్పడే వారి పనిపట్టడం ఈడీ, ఐటీ శాఖల పనికాగా, అది మరచి అవి దేశంలోని రాజకీయ నాయకులను లక్ష్యంగా చేసుకుని దాడులు చేస్తున్నాయని సీఎం అశోక్ గెహ్లోట్ ఆరోపించారు.

అవినీతిపై బీజేపీ పోరాటం ఓ గిమ్మిక్కు

ఈడీ భయంతో ఆ పార్టీలోకి అవినీతిపరులు: కేజ్రీవాల్

చండీగఢ్, నవంబర్ 5: అవినీతిపై మోదీ సర్కారు పోరాటం ఓ గిమ్మిక్కు అని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. అవినీతిపరులంటూ బీజేపీ విమర్శించిన నేతలు ఆ పార్టీలో చేరగానే సచ్ఛీలురుగా మారిపోతారని, వారికి ఆ పార్టీ మంత్రి పదవులు కట్టబెడుతుందని విమర్శించారు. హర్యానాలోని రోథక్‌లో జరిగిన ఆప్ పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరైనా నేత భారీ అక్రమాలు, అవినీతికి పాల్పడి బీజేపీలో కనుక చేరితో సీబీఐ కానీ, ఈడీ కానీ వారి జోలికి రావడానికే భయపడతాయని ఆయన చెప్పారు. అసలు అవినీతి పరులు అంటే ఎవరు? అని ప్రశ్నించిన ఆయన.. ఈడీ అరెస్ట్ చేసి కటకటాల వెనక్కి పంపిన వారు అవినీతి పరులు కాదని, ఎవరైతే అక్రమాలకు పాల్పడి ఈడీకి భయపడి బీజేపీలో చేరుతారో వారే అసలైన అవినీతిపరులని ఆయన విమర్శించారు.

కాగ్ స్వతంత్రతకు కేంద్రం పాతర

- ఫీల్డ్ ఆడిట్ నిలిపేయడం రాజ్యాంగ ఉల్లంఘనే
- ఆడిట్ సంస్థ స్వతంత్రత దెబ్బతినకుండా చూడండి
- రాష్ట్రపతి ముర్ముకు మాజీ ఉన్నతాధికారుల లేఖ

న్యూఢిల్లీ, నవంబర్ 5: కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఆఫ్ ఇండియా (కాగ్) స్వతంత్రతను కేంద్రంలోని మోదీ సర్కారు దెబ్బతీస్తున్నదని మాజీ ఉన్నతాధికారులు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు బహిరంగ లేఖ రాశారు. దీనిపై 86 మంది విశ్రాంత ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్ అధికారులు సంతకం చేశారు. కాగ్ స్థాపిత ఉద్దేశాలు, దాని స్వతంత్రత దెబ్బతినకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని రాష్ట్రపతిని అభ్యర్థించారు. కాగ్ కార్యకలాపాలు పడిపోతున్నాయని.. కేంద్ర ప్రభుత్వ శాఖలు, విభాగాలపై కాగ్ వెలువరించిన నివేదికలే ఇందుకు ఉదాహరణ అని వారు పేర్కొన్నారు. 2015లో కాగ్ 55 నివేదికలు వెలువరించగా.. 2020 నాటికి అది 75 శాతం పడిపోయి 14కు చేరిందన్నారు. గతంలో పనిచేసినంత వేగంగా కాగ్ ఇప్పుడు పని చేయడం లేదని.. కేంద్ర ప్రభుత్వ పనితీరుపై పార్లమెంటుకు సమర్పించే ఆడిట్ నివేదికల సంఖ్యలో తగ్గుదల ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. ఈ ఏడాది సెప్టెంబర్‌లో పార్లమెంట్‌కు సమర్పించిన కాగ్ నివేదికలు అవినీతిని బయటపెట్టాయని.. దీంతో ఈ ఆడిట్‌కు బాధ్యులైన అధికారులను కేంద్రం బదిలీ చేసిందని ఆరోపించారు. ఎన్‌హెచ్ఏఐ, ఆయుష్మాన్ భారత్ ప్రాజెక్టుల్లో ప్రభుత్వం, ప్రభుత్వ విభాగాలు తప్పుడు లేదా అధిక వ్యయం చేసిన ఉదంతాలను గణాంకాలతో సహా నివేదికలు బయటపెట్టాయని.. అందుకే ఆ అధికారులను బదిలీ చేశారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ విభాగాల ఆడిటింగ్‌కు అత్యంత కీలకమైన ఫీల్డ్ వర్క్‌ను నిలిపివేయాలని కాగ్ అధికారులు ఆదేశాలివ్వడాన్ని వారు ప్రస్తావించారు. 'కాగ్ రిపోర్ట్ మీడియా దృష్టికి వచ్చిన తర్వాత క్షేత్రస్థాయి ఆడిట్ నిలిపేయడం తీవ్రమైన అంశం. ఫీల్డ్ ఆడిట్ వర్క్‌ను నిలిపేయడంమంటే కాగ్ పనిచేయడం లేదన్న మాటే. ఇది తీవ్రమైన రాజ్యాంగ ఉల్లంఘనే' అని మాజీ ఉన్నతాధికారులు ఆందోళన వ్యక్తం చేశారు.

కాగ్ నివేదికల్లో తగ్గుదల ఇలా..

ఏడాది	నివేదికలు
2015	54
2016	43
2017	50
2018	19
2019	18
2020	17
2021	28
2022	30
2023	16

'కిలోనోవా' పేలుడుతో భూమిపై జీవం అంతం?

న్యూయార్క్ : విశ్వంలో అంతుబట్టని రహస్యాలెన్నో. వీటిని ఛేదించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్న అమెరికా ఖగోళ పరిశోధకులు ఓ షాకింగ్ విషయాన్ని కొనుగొన్నారు. విశ్వంలో జరిగే కిలోనోవా అంతరిక్ష పేలుడు భూమిపై ఉన్న జీవం అంతానికి కారణమవుతుందని తేల్చారు. రెండు న్యూట్రాన్ నక్షత్రాలు ఢీకొట్టుకోవడం లేదా న్యూట్రాన్ స్టార్ బ్లాక్‌హోల్‌లో కలిసిపోవడాన్ని కిలోనోవా అంటారు. భూమినుంచి 36 కాంతి సంవత్సరాల దూరంలో గనుక ఈ కిలోనోవా దృగ్విషయం సంభవిస్తే గామా, ఎక్స్, కాస్మిక్ కిరణాలు ప్రాణాంతకమైన రేడియేషన్‌ను విడుదల చేస్తాయని, దీనివల్ల భూమిపై ఉన్న జీవరాశి తుడుచుకుపెట్టుకుపోతుందని పరిశోధకులు గుర్తించారు. అయితే, భూమికి ఇప్పటికిప్పుడు ముంచుకొచ్చిన ప్రమాదమేమీ లేదని, కిలోనోవాలాంటి దృగ్విషయాలు చాలా అరుదుగా జరుగుతాయని తెలిపారు.

ఢిల్లీని కమ్మేసిన కాలుష్యం

10 వరకు బడులకు సెలవు..నిర్మాణ పనులపై నిషేధం

న్యూఢిల్లీ, నవంబర్ 5: దేశ రాజధాని ఢిల్లీని వాయుకాలుష్యం కమ్మేసింది. ప్రపంచ ఆరోగ్య సంస్థ పరిమితి కంటే ఇక్కడ వందరెట్లు అధిక కాలుష్యం ఉన్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. తీవ్ర వాయు కాలుష్యం నేపథ్యంలో బడులకు ఈ నెల 10 వరకు సెలవులు పొడిగిస్తున్నట్టు ప్రభుత్వం తెలిపింది. మరోవైపు ఢిల్లీలోకి అత్యవసర సేవలను అందించే వాహనాలు మినహా కాలుష్య కారక ట్రక్కులు, నాలుగు చక్రాల కమర్షియల్ వాహనాల ప్రవేశంపై కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. నిర్మాణ, కూల్చివేత కార్యకలాపాలపైనా నిషేధం విధించింది. కాలుష్య నియంత్రణకు చర్యలు తీసుకోవాలని ఢిల్లీ, రాజధాని ప్రాంత పరిధిలోని రాష్ట్రాలను కోరింది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు 50 శాతం మంది సిబ్బందిని ఇంటి నుంచే పనిచేసేలా చూడాలని సూచించింది.

3 నిమిషాల్లో కొవిడ్, క్యాన్సర్ గుర్తించే పరికరం

లండన్, నవంబర్ 5: కొవిడ్, క్యాన్సర్‌ను 3 నిమిషాల్లో కచ్చితంగా గుర్తించే చిన్న పాటి జన్యు పరీక్ష పరికరాన్ని యూకే శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. 'ప్రపంచంలో అత్యంత వేగవంతమైన కొవిడ్ టెస్ట్'గా ఈ పరికరాన్ని యూనివర్సిటీ ఆఫ్ బాత్ ఇంజినీర్లు అభివర్ణించారు. ముక్కు ద్వారా సేకరించిన శాంపిల్‌ను 'ల్యాబ్ ఆన్ ఏ చిప్' సాంకేతికత ద్వారా తక్కువ ఖర్చుతో ఈ పరికరం ద్వారా పరీక్షించి కొవిడ్ ఉందో లేదో నిర్ధారించవచ్చు. ఈ పరీక్ష ఫలితాన్ని స్మార్ట్‌ఫోన్ యాప్‌లో చూడవచ్చు. మురికి నీటిని ఈ పరికరంలో పరీక్షించి అందులో కొవిడ్ తదితర వ్యాధులను, ఇన్ఫెక్షన్లను వ్యాపింపచేసే వైరస్‌లను గుర్తించవచ్చు.

అణుబాంబు ప్రయోగానికీ వెనుకాడం

- ఆప్షన్‌గా పెట్టుకున్నామన్న ఇజ్రాయెల్ మంత్రి అమిచాయ్
- ప్రభుత్వ సమావేశాల నుంచి సస్పెండ్ చేసిన నెతన్యాహూ
- శరణార్థి శిబిరంపై బాంబు దాడి.. 40 మంది మృతి!